ప్రజాశక్తి
మంగళవారం 28 అక్టోబర్ 2025 5
శ్రీ సత్యసాయి





మొక్కజొన్నను పరిశీలిస్తున్న నాయకులు

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి. రాంభూపాల్

ప్రజాశక్తి - కొత్తచెరువు

మొక్కజొన్న పంటలను సాగు చేసిన రైతుల కోసం ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని రాష్ట్ర సిపిఎం కార్యదర్శివర్గ సభ్యులు వి రాంభూపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సోమవారం కొత్తచెరువులోని ధర్మవరం రోడ్డు రైస్ మిల్ వద్ద ప్లాట్‌ఫాంపై లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన రైతులు శ్రీనివాసులు, పుల్లప్ప నిలువ ఉంచిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంభూపాల్ మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో గత మూడు సంవత్సరాలుగా రైతులు మొక్కజొన్న పంటను అధికంగా సాగు చేస్తున్నారని చెప్పారు. ఈ పంటకు గిట్టుబాటు ధర కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. దళారులు, వ్యాపారులు రైతుల నుండి క్వింటా ధర 18 వందలకు కొనుగోలు చేస్తున్నారని ఆ ధర రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదన్నారు. ప్రభుత్వం ఆలస్యంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నందున దళారులు, వ్యాపారులు రైతుల నుండి తీసుకున్న స్టాకును అలాగే ఉంచుకొని ఈ కొనుగోలు కేంద్రాల్లో అధిక డబ్బులకు అమ్ముకుంటున్నారన్నారు. ఈ దళారీ వ్యవస్థను ప్రభుత్వం నియంత్రించాలని రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని కోరారు. రైతులు అధిక పెట్టుబడులు పెట్టి పండిస్తే వాటికి ధర లేకపోవటంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే ప్రభుత్వం రైతులకు ఎరువులను, ప్రత్యామ్నాయ విత్తనాలను అందించడంలో విఫలమైందన్నారు. యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్న ప్రభుత్వం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్దన్న, సిపిఎం నాయకులు లక్ష్మీనారాయణ, రైతు సంఘం నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్, మండల కార్యదర్శి ముత్యాలు, ప్రాంతీయ కార్యదర్శి బేళ్ల అంజి, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

16 ఏళ్లుగా పెండింగే...

66 వాయిదాలైనా అరెస్టు లేదు
ఎస్సీఎస్టీ అట్రాసిటీ బాధితులకు న్యాయం జరిగేదెన్నడు ?
నేడు 'అనంత'లో సాంఘిక సంక్షేమ కమిటీ పర్యటన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

జిల్లాలో ఎస్సీ,ఎస్టీ కేసుల నమోదవుతున్నప్పటికీ వాటి పరిష్కారాలకు దశాబ్ధాల తరబడి బాధితులు ఎదురుచూసే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కేసులు పూర్తయి శిక్షలు పడేలోపు జీవితకాలం కాస్తా పూర్తవుతున్నాయి. ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీతోపాటు సాంఘిక సంక్షేమ పరిస్థితులను అధ్యయనం చేయడానికి శాసనసభా పక్ష కమిటీ అనంతపురం జిల్లాకు మంగళవారం రానుంది. కమిటీ అధ్యక్షులు వర్ల కుమార్ రాజా ఆధ్వర్యంలో సభ్యులు కొండ్రు మురళీ, కొలకుపూడి శ్రీనివాసరావు, తాటిపర్తి చంద్రశేఖర్, దేవి వరప్రసాద్, బొనెల విజయచంద్ర, ఎంఎస్.రాజు, రోషన్ కుమార్, విజయకుమార్, ఎమ్మెల్సీలు కావలి గ్రీష్మ, బొమ్మి ఇస్మాయిల్, ప్రసాద్, మురళీధర్ తదితరులు రానున్నారు. ఈనేపథ్యంలోనైనా అనేక ఏళ్లుగానున్న ఎస్సీఎస్టీ అట్రిసిటీ కేసుల నమోదుపై దృష్టి సారిస్తారా లేదా అన్నది చూడాల్సి ఉంది.

16 ఏళ్లుగా పెండింగులోనే ..

ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులు చాలా వరకు త్వరిగతిన పూర్తవడం లేదన్న విమర్శ ఉంది. దశబ్ధాల తరబడి పెండింగులోనే ఉంటుండటంతో బాధితులకు సత్వర న్యాయం జరగడం లేదన్న అసంతృప్తి ఉంది. కేసుల తీరు ఏ రకంగా ఉందనటానికి ఒక ఉదాహరణగా గార్లదిన్నె పోలీసు స్టేషన్ పరిధిలో నమోదయిన ఒక కేసును చూడవచ్చు. 2009లో గార్లదిన్నె పోలీసు స్టేషన్ పరిధిలో దళిత కొండూరు మునియప్పపై సయ్యద్ బాషా దాడి చేసినట్టు కేసు నమోదయింది. ఈ కేసుకు సంబంధించి 2010 అక్టోబరు నాలుగో తేదీన పోలీసులు ఛార్జీ షీటు దాఖలు చేశారు. ఎస్సీఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం 2011లో ఈ కేసును మార్చారు. కేసు విచారణ 2014న ఆరంభమైంది. అప్పటి నుంచి వాయిదాలు మీద వాయిదాలు పడుతున్నాయే తప్ప నాన్‌బెయిలబుల్ కేసు కింద నిందితుడు కోర్టు హాజరైంది లేదు. ఈ కేసు నమోదయి 16 సంవత్సరాలు కావస్తున్నా ఇప్పటి వరకు నిందితుడిని కోర్టు ముందుకు తీసుకురాలేకపోయారు. దీంతో బాధితుడికి న్యాయం జరిగే పరిస్థితి లేకుండాపోయింది. ఇలాంటి కేసే 2012లో నుంచి పెండింగులోనే ఉంది. రాప్తాడు పోలీసు స్టేషన్ పరిధిలో 2017 నుంచి ఒక కేసు వాయిదాలతోనే నడుస్తోంది. మచ్చుకు ఇవి మాత్రమే. ఇలాంటి కేసులు పదుల సంఖ్యలో జిల్లాలో పెండింగులో ఉన్నాయి. కేసుల్లో జరుగుతున్న జాప్యంతో నిందితులు తప్పించుకుని బయటకు తిరుగుతున్నారు. బాధితులకు మాత్రం న్యాయం జరిగే సూచనలు కనిపించడం లేదు. న్యాయం కోసం కళ్లక కాయలు కాసేలా న్యాయదేవత వైపు ఎదురు చూడాల్సి వస్తోంది.

నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలి



ఎస్సీ,ఎస్టీ కేసుల విచారణలోనూ తీరని జాప్యం జరుగుతోంది. తద్వారా బాధితులకు సకాలంలో న్యాయం జరగడం లేదు. ఈ జాప్యాన్ని చూసుకుని మరికొంత మంది ఎస్సీ,ఎస్టీలపై దాడులకు తెగబడే పరిస్థితులు నెలకొన్నాయి. ఇప్పటికైనా అధికార యంత్రాంగం జాప్యం చేయకుండా కేసుల విచారణ వేగవంతం చేయడంతోపాటు త్వరితగతిన నిందితులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి. అప్పుడే నిందితుల్లో భయం ఏర్పడే అవకాశముంది.

ఓ.నల్లప్ప,
కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు

ప్రజా గ్రీవెన్స్ ఫిర్యాదులు పరిష్కారమయ్యేనా..?

పలుమార్లు మండల స్థాయిలో ఫిర్యాదులు
కదిరిలో జరిగిన గ్రీవెన్స్ లో మరోమారు జిల్లా కలెక్టర్, ఎస్పీ దృష్టికి

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరిలో సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదికకు గతంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పరిష్కారం కాని సమస్యలపైనే ఫిర్యాదులు అందాయి. వివిధ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏర్పాటు చేస్తోంది. అయితే ప్రజలు తమ సమస్యలను మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకువచ్చిన అధికశాతం పరిష్కారం కాలేదు. పలుమార్లు తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం కన్పించకపోవటంతో పరిష్కారం కాని ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎందుకన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. భూమికి సంబంధించిన సమస్యను ఆరు దఫాలుగా మండల అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ఫలితం కనిపించలేదని తనకల్లు మండల బిసినివారిపల్లి కి చెందిన సురేంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. తనకల్లు మండల టీ సదుం పంచాయతీ బిసినివారిపల్లి గ్రామానికి చెందిన ఐదుగురికి 24 సర్వే నెంబర్‌లో దాదాపు 30 ఎకరాలు దాకా భూమి ఉంది. అయితే అదే సర్వేనెంబర్‌లో అదే గ్రామానికి చెందిన రామిరెడ్డి, ఫణికర్ రెడ్డిల కుటుంబ సభ్యులు తమకు సంబంధించిన భూమిని సైతం అధికారుల సహకారంతో వారి పేరు మీద పాసు పుస్తకం చేసుకున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ సమస్యపై మండలస్థాయి గ్రీవెన్స్‌లో పలుమార్లు తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా సమస్యను పరిష్కరించిన పాపాన పోలేదని వాపోయాడు. ఈనేపథ్యంలో సోమవారం కదిరిలో జరిగిన గ్రీవెన్స్ లో మరోమారు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ దృష్టికి తన సమస్యను తీసుకెళ్లానని ఇప్పటికైనా కలెక్టర్ తన సమస్య పరిష్కారం చేయాలని బాధిత రైతు కోరుతున్నాడు. అలాగే అమడగూరు మండలం తుమ్మల పంచాయతీ మలకవారిపల్లికి చెందిన పార్వతమ్మకి దాయాదుల మధ్య భూమి తగాదాతో ఘర్షణ చోటుచేసుకుంది. ఈ విషయంపై స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ తమకు న్యాయం జరగలేదని బాధితులు వాపోయారు. ఈ విషయంపై ఈనెల 13న జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్‌కి ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఇప్పటికీ తమపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోలేదని వాపోయారు. దీంతో ఇదే విషయమై మరోమారు కదిరిలో ఎస్పీకి ఫిర్యాదు చేశామని స్పందించిన ఎస్పీ రెండు రోజులలో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఇలాంటి పలు సమస్యలు సోమవారం కదిరిలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అధికారుల దృష్టికి వచ్చాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని

ఫిర్యాదుల వెల్లువ



కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

కదిరిలో జిల్లా ప్రజాసమస్యల పరిష్కారవేదిక
పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నియోజకవర్గం వ్యాప్తంగా ప్రజలు భారీ సంఖ్యలో వచ్చి అర్జీలు సమర్పించారు. కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎస్పీ సతీష్‌కుమార్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రజల నుంచి 557 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన అర్జీలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబందిత అధికారులను కలెక్టర్, ఎస్పీ ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన వారిని బారికేడ్లతో నిలువరించి అనేక ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరిని నేరుగా కలిసి విజ్ఞప్తులను స్వీకరించడంతో పాటు ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రజల సమస్యలను తెలుసుకొని వాటికి పరిష్కార మార్గాన్ని చూపడానికే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ మౌర్య భరద్వాజ్, ఆర్డీవో వివిఎస్ శర్మ, కదిరి తహశీల్దార్ మురళీకృష్ణతో పాటు ఆయా శాఖ అధికారులు పాల్గొన్నారు.

పలు వినతులు

కదిరి టౌన్ : నూతన జిల్లాలో విద్యా పరంగా యూనివర్సిటీ లేక ఉన్నత విద్య కోసం విద్యార్థులు పక్క ప్రాంతాలలో చదువుకొనే పరిస్తితి ఎదురవుతోందని శ్రీ సత్యసాయి జిల్లాలో యూనివర్సిటీ నీ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని ఎఐఎస్‌పి నాయకులు నరసింహ జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ కి విన్నవించారు. ఈ సందర్భంగా సోమవారం కదిరి లో జరిగిన గ్రీవెన్స్ లో వినతి పత్రం అందజేశారు.

మా గ్రామాల్లో సోలార్ వద్దు

సోలార్ పవర్ ప్లాంట్ కోసం బలవంతపు భూసేకరణ చేస్తున్నారని ఆ గ్రామాలలో సోలార్ ప్రాజెక్టు వద్దని నంబులపూల కుంట మండలంలోని వెలిచెలమల, వంకమద్ది, ధనియనిచెరువు, మర్రికొమ్మదిన్నె పంచాయతీలకు చెందిన రైతులు జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ కి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆ ప్రాంతంలో ఉండే అన్ని గ్రామాల రైతులు వ్యవసాయం, పశుపోషణ మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారని ఇప్పుడు ఈ ప్రాంతంలో సోలార్ పవర్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తే ఉన్నాఫలంగా జీవనం లేక రోడ్డున పడాల్సి వస్తుందని వాపోయారు సాగులో ఉన్న ప్రతి ఒక్క రైతుకి పట్టాలు మంజూరు చేయాలని కోరారు.

దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించండి : సిపిఎం

కదిరి పరిధిలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి జిల్లా స్థాయి అధికారులు చొరవ చూపాలని సిపిఎం నాయకులు కోరారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు సిపిఎం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కదిరి పట్టణంలో ఇఎస్ఐ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో పేద కార్మికులకు ఉపాధి (గార్మెంట్స్), ఏరియా ఆసుపత్రిలో నిర్మాణంలో ఉన్న నూతన భవనాల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కోరారు. పట్టణంలో 10 వేల మందికి పైగా కార్మికులు బీడీ తయారీ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పొగాకుతో నిరంతరం పనిచేయడం వల్ల ఈ వృత్తిలో ఉన్నవారు క్షయ, క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. వీరిని ఆదుకోవడానికి కదిరిలో ఇఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని కోరారు. బీడీ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. లక్షకు పైగా జనాభా ఉన్న కదిరి పట్టణంలో వాహనాల రద్దీ రోజురోజుకూ పెరుగుతున్నది. దీని వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తి పట్టణ వాసులకు తీవ్ర ఇబ్బందులు కలగడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఈ ఇబ్బందులను నివారించడానికి పట్టణంలో ట్రాఫిక్ పోలీస్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. నియోజక వర్గంలో వేలాది మంది మహిళలు, యువతీ, యువకులు ఉపాధి పనుల కోసం పెనుకొండ, పులివెందుల, గోరంట్లలో ఉన్న గార్మెంట్స్, కియామోటార్స్ పరిశ్రమల లోకి వెళ్తున్నారని కదిరి ప్రాంతంలో ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఏర్పాటు చేసి వలసను నివారించాలని కోరారు. కదిరి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతన భవనాల నిర్మాణం ఏళ్ళ తరబడి సాగుతోందని. ఫలితంగా రోగులు డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ భవనాల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు సాంబశివ, రామ్మోహన్, బాబ్జాన్, రాజారెడ్డి, సుధాకర్ రెడ్డి, అక్కులప్ప, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యను వివరిస్తున్న సిపిఎం నాయకులు

మాజీ జెడ్పీ ఛైర్మన్ రెడ్డప్ప రెడ్డి కన్నుమూత

ప్రజాశక్తి - తనకల్లు



రెడ్డప్ప రెడ్డి (ఫైల్‌ఫొటో)


మండల పరిధిలోని పరాకువాండ్లపల్లికి చెందిన మాజీ జెడ్పీ ఛైర్మన్ దేశాయి రెడ్డప్ప రెడ్డి వయోభారంతో సోమవారం మృతిచెందాడు. రెడ్డప్పరెడ్డి కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుండి ఆ పార్టీలో కొనసాగుతూ 1981 వ సంవత్సరంలో తనకల్లు గ్రామ సర్పంచిగా (అప్పట్లో సమితి ప్రెసిడెంట్ అనేవారు)గెలుపొందారు. అనంతరం జరిగిన పరిణామాల్లో అయన 1981 సంవత్సరంలో ఉమ్మడి అనంతపురం జిల్లా పరిషత్ ఛైర్మన్ గా ఎంపికయ్యారు.1985 వ సంవత్సరంలో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 1991 నుండి 1993 వ సంవత్సరం వరకు డిసిసిబి ప్రెసిడెండ్‌గా పని చేశారు. మండల వ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారు పరాకు వాండ్లపల్లి లో మార్కెట్ యార్డ్, పశువుల ఆసుపత్రి, తనకల్లు మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేయడానికి ఆయన కీలక పాత్ర పోషించారు. అంతేకాకుండా ప్రతి గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుంది. అలాగే ప్రతి గ్రామంలోనూ ఆయన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్లు మండల ప్రజలు చెబుతున్నారు. మంగళవారం ఆయన స్వగ్రామమైన పరాకు వాండ్ల పల్లిలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ స్ఫూర్తితో ఎదగాలి

విగ్రహాల ఆవిష్కరణలో ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి - మడకశిర టౌన్

అంబేద్కర్, జగ్జీవన్ రామ్ స్ఫూర్తితో ఎస్సీ ఎస్టీ బీసీలు ఎదగాలని ఎంపీలు, ఎమ్మెల్యేలు పిలుపునిచ్చారు. మడకశిర నగర పంచాయతీ పరిధిలోని బేగార్లపల్లి గ్రామంలో డాక్టర్ అంబేద్కర్,బాబు జగ్జీవన్ రావ్ విగ్రహాలను సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ప్రసాదు, పార్థసారథి, ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, రైల్వే కోడూర్ శ్రీధర్,,పామరు పర్ల కుమార్ రాజా, పార్వతీపురం విజయ్ చంద్ర, పూతలపట్టు మురళీమోహన్, చింతలపూడి రోషన్, కోడూరు దస్తగిరి, నందికొట్కూరు జయ సూర్య, సూళ్లూరుపేట విజయ శ్రీ, ఎమ్మెల్సీ గ్రీష్మ తదతరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వక్తలు మాట్లాడుతూ అంబేద్కర్, జగ్జీవన్‌రామ్ చేసిన సేవల గురించి వివరించారు. ఆర్థిక అసమానతలు తొలగాలంటే ఒక్క విద్యతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ నిధుల నుంచి మడకశిర అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎంపీలు ప్రసాద్, పార్థసారథిని స్థానిక ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామి, రాష్ట్ర ఒక్కలిగా కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, మున్సిపల్ ఛైర్మన్ నరసింహ రాజు, తెలుగు దేశం పార్టీ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు




విగ్రహాల ఆవిష్కరణ సందర్భంగా నాయకులు, ప్రజాప్రతినిధులు

స్వాతంత్ర్య సమరయోధులు బిఎన్.రెడ్డి ఇకలేరు..

నివాళులు అర్పించిన కవులు, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం సమీపంలోని కర్నాటక రాష్ట్రం వెంకటాపురంలో నివాసముంటున్న ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు బిఎన్.రెడ్డి (103) సోమవారం మతి చెందారు. స్వాతంత్ర సమరయోధులు కల్లూరు సుబ్బారావు, ఎఎం. లింగన్న సమకాలికులు బియన్ రెడ్డి. స్వాతంత్ర ఉద్యమాలలో అనేకసార్లు జైలు జీవితం గడిపారు. కర్నాటక ప్రాంతంలోని విధురాస్వతంలో జరిగిన దక్షిణ భారత జలియన్వాలాబాగ్ ఉద్యమంలో కూడా కల్లూరు సుబ్బారావుతో కలసి పాల్గొన్నారు. ఆ ఉద్యమంలో అనేకమంది కాల్పుల్లో మృతిచెందారు. బిఎన్. రెడ్డి ఎంతో సామాజిక స్పృహతో గత శతాబ్దపు జీవన విధానాన్ని ఇప్పటి తరానికి వారధిగా ఉండి అందించిన గొప్ప మానవతా వాది. ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితులు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం ఉదయం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే ఇటు ఆంధ్రా, అటు కర్నాటక ప్రాంతాలకు చెందిన అనేకమంది ప్రముఖులు, రాజకీయ, కార్మిక, సంఘాల నాయకులు వెంకటాపురం చేరుకుని ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించారు. హిందూపురం తపన సాహిత్యవేదిక ఆధ్వర్యంలో బిఎన్ రెడ్డి మృత దేహానికి సడ్లపల్లె చిదంబరరెడ్డి, రైతు సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి, మానవ హక్కుల వేదిక నాయకులు శ్రీనివాసులు, చైతన్య గంగిరెడ్డి, లైఫ్ వరల్డ్ ఉదయ్ కుమార్, బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు శివరామకృష్ణ, కోనాపురం ఈశ్వరయ్య, రాష్ట్ర వాల్మీకి సంఘం నాయకులు నాగార్జున, మాజీ కౌన్సిలర్ దాదా పీర్, మనోజ్ జూలియట్ మింటూ తదితరులు నివాళులర్పించారు.



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న కవులు, ప్రజా సంఘాల నాయకులు

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తాం

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి పురపాలక సంఘ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల దినోత్సవాన్ని ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో తహశీల్దార్ కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి పురపాలక శాఖ ఒక అధికారి పాల్గొనేవారనికలెక్టర్ సూచనల మేరకు మున్సిపల్ కార్యాలయంలోని ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని ప్రారంభించడం జరిగిందని చెప్పారు. పట్టణ వ్యాప్తంగా ఉన్న ప్రజలు పురపాలక శాఖ తరపున ఏ సమస్య ఉన్న నేరుగా ప్రతి సోమవారం జరిగే ప్రజా ఫిర్యాదుల కార్యక్రమానికి హాజరై వారి సమస్యలను విన్నవించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దస్తగిరి, డీఈలు, ఏఈలతో పాటు ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.



ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అధికారులు

విద్యార్థులు సేవాభావం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

విద్యార్థులు, యువత సేవాభావాన్ని పెంపొందించుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మున్సిపల్ ఛైర్మన్ డిఈ రమేష్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎస్.ఎస్.పి.ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగపు ఆధ్వర్యంలో స్థానిక ఆరవవార్డు గుడ్డంలో ప్రత్యేక శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి, యువత సేవాభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వారం రోజులు పాటు జరిగే ఈ ప్రత్యేక శిబిరంలో దుర్గాబాయి దేశముఖ్ మున్సిపల్ ప్రాథమిక ప్రాథమిక పాఠశాల, ఉర్దూ పాఠశాల, భవిత కేంద్రం పరిసర ప్రాంతాలు, ఎం.జి.ఎం క్రీడా మైదానం పరిసర ప్రాంతాల్లో దట్టంగా పెరిగిన కంప చెట్లు, పిచ్చి మొక్కల్ని తొలగించేందుకు ప్రణాళికలు వేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం ప్రగతి, మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, భవిత సెంటర్ ఇన్‌ఛార్జి లలిత, ఐక్య కోఆర్డినేటర్ శ్రీ లక్ష్మి, అధ్యాపకులు రమేష్, ప్రకాష్ రావు, పార్వతి, ఎన్ఎస్ఎస్ పిఓ రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ బి. నరసింహులు, కళాశాల సిబ్బంది భార్గవి, శ్రీకాంత్ సిద్ధప్ప పాల్గొన్నారు.

ప్రజాశక్తి www.prajasakti.com

నేడు ఎస్సీ సంక్షేమ కమిటీ పర్యటన : కలెక్టర్


పుట్టపర్తి అర్బన్ : ఎపి షెడ్యూల్ కులాల సంక్షేమ శాసనసభ కమిటీ మంగళవారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ కమిటీ సభ్యులు మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో షెడ్యూల్ కులాల ప్రజలు, సంఘాల నాయకులు, ప్రతినిధుల నుంచి వినతి పత్రాలు స్వీకరిస్తారన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశం నిర్వహిస్తారన్నారు. అందులో సంక్షేమ పథకాల అమలు, పెండింగ్ అట్రాసిటీ కేసులు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల వసతి, ప్రభుత్వ సేవలు, రిజర్వేషన్ల అమలు, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షిస్తారన్నారు. శాసనసభ కమిటీ అధ్యక్షులు కుమార రాజా వర్ల ఆధ్వర్యంలో 11 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశంలో పాల్గొంటారన్నారు. కావున సంబంధిత అధికారులు పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు.

దిశా సమావేశం వాయిదా

పుట్టపర్తి అర్బన్ : పట్టణంలోని కలెక్టరేట్‌లో ఈ నెల 28వ తేదీ నిర్వహించాల్సిన దిశా సమావేశం వాయిదా వేసినట్లు జడ్పీ సీఈఓ శివశంకర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మొంథా తుఫాను ప్రభావం వల్ల ఈ నెల 28, 29 తేదీల్లో జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో కలెక్టర్ సూచన మేరకు సమావేశాన్ని వాయిదా వేశామన్నారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని, అధికారులు గమనించాలని ఆయన కోరారు.

పోలీస్ 'ఓపెన్ హౌస్' ఎగ్జిబిషన్ ప్రారంభం

పుట్టపర్తి రూరల్ : పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓపెన్ హౌస్ ఎగ్జిబిషన్‌ను సోమవారం ఎఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, ఆర్ఐలు వలి, మహేష్, రవికుమార్ ప్రారంభించారు. ఎగ్జిబిషన్ విద్యార్థులు సందర్శించి ఆసక్తిగా తిలకించారు. ఎఆర్ డీఎస్పీ మాట్లాడుతూ పోలీసుల విధి నిర్వహణలో భాగంగా వినియోగించే దుస్తులు, పరికరాలు, నేరాల దర్యాప్తులో వాడే పరికరాలు, తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఈ ఓపెన్ హౌస్ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. వారోత్సవాల్లో భాగంగా ప్రజల శ్రేయస్సు, దేశ రక్షణలో ప్రాణాలర్పించిన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఐలు వీరన్న, వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


లక్ష్మీనారాయణయాదవ్‌కు సన్మానిస్తున్న నాయకులు

లక్ష్మీనారాయణయాదవ్‌కు సన్మానం

చిలమత్తూరు : అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన జి.లక్ష్మీనారాయణయాదవ్‌ను సోమవారం స్థానిక ఆయన వ్యక్తిగత కార్యాలయంలో టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. ముందుగా నాయకులు జి.లక్ష్మీనారాయణ యాదవ్‌కు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి అభినందించారు. సమాజ సేవ, యాదవ సామాజిక వర్గం అభ్యున్నతికి లక్ష్మీనారాయణ చేస్తున్న కృషి ప్రశంసనీయం అని కొనియాడారు. యాదవ సంఘం అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని లక్ష్మీనారాయణ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్, జనసేన నాయకులు చిన్న ప్రవీణ్, అగ్ని శ్రీనివాసులు, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు

ధర్మవరం రూరల్ : ఎవరైనా మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని టూ టౌన్ సిఐ నాగేంద్ర ప్రసాద్ హెచ్చరించారు. సిఐ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో అనుమానిత వ్యక్తులను తనిఖీ చేశారు. వాహనదారుల వద్ద ఉన్న బ్యాగులను పరిశీలించారు. అనంతరం ట్రిపుల్ రైడింగ్, మైనర్లు బైకులు నడపడం, లైసెన్స్ లేని వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. సిఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడిపినా, మైనర్లకు బైక్ ఇచ్చినా, నెంబర్ ప్లేట్ లేకపోయినా బైకును సీజ్ చేస్తామన్నారు. బైక్‌పై ముగ్గురు వెళ్లినా, లైసెన్స్ లేకపోయినా జరిమానా విధిస్తామన్నారు. ప్రతిఒక్కరూ లైసెన్స్ తీసుకోవాలన్నారు.

నూతన ఉపాధ్యాయులకు ఆత్మీయ ఆహ్వానం

కదిరి టౌన్ : మెగా డీఎస్సీ–2025 ద్వారా ఎంపికై పట్టణంలోని వీవర్స్ కాలనీలో ఉన్న మున్సిపల్ ఉన్నత పాఠశాల నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు ఎస్.నాగరాజు, కె.ఈశ్వరయ్యలకు సోమవారం కదిరి అర్బన్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆత్మీయ ఆహ్వానం పలికారు. హెచ్‌ఎం శైలజ, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో యుటిఎఫ్ పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మధుసూదన్ రెడ్డి, రాజేష్ ఆధ్వర్యంలో జ్ఞాపిక, సేవా పుస్తకం ఇచ్చి ఆహ్వానం పలికారు. విద్యార్థులకు మంచి క్రమశిక్షణ నేర్పడంతో పాటు క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ సీనియర్ నాయకులు సుధాకర్, మధుసూదన్‌రెడ్డి, భార్గవ్, పవన్ పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

రొద్దం : మండలంలోని నారనాగేపల్లి గ్రామంలో సోమవారం వాల్మీకి సామాజిక వర్గం ప్రజలు వాల్మీకి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళలు పెద్దఎత్తున జ్యోతులను నెత్తిన ఎత్తుకుని గ్రామ వీధుల్లో ఊరేగింపుగా వెళ్లి వాల్మీకి విగ్రహానికి సమర్పించారు. అలాగే వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గోవిందు, మహిళలు, ఆ వర్గం ప్రజలు పాల్గొన్నారు.



ఊరేగింపుగా జ్యోతులు తీసుకెళ్తున్న మహిళలు

వినియోగదారుల సంఘం కమిటీ ఏర్పాటు

ధర్మవరం రూరల్ : పట్టణంలో సోమవారం వినియోగదారుల సంఘం మండల గౌరవాధ్యక్షులు కుళ్లాయప్ప ఆధ్వ ర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా వినియోగదారుల సంస్థ సమైక్య అధ్యక్షులు జి.సురేష్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు పలు అంశాలపై చర్చించారు. అనంతరం ధర్మవరం వినియోగదారుల సమాచార కేంద్రం, ధర్మవరం వినియోగదారుల సంఘానికి తాత్కాలిక కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షులుగా ఎస్.గోవిందప్ప, సెక్రటరీగా చిన్న తంబి చిన్నప్పను ఎన్నుకు న్నారు. సురేష్‌కుమార్ మాట్లాడుతూ వినియోగదారుల సంఘానికి తదుపరి ఎన్నికలు నిర్వహించేంత వరకూ వీరు పదవుల్లో కొనసాగుతారని తెలిపారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలివ్వాలి

ఓబుళదేవరచెరువు : మండలంలోని సున్నంపల్లి పంచాయతీతో పాటు అన్ని పంచాయతీ ల్లో పని చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికులకు తక్షణమే బకాయి వేతనాలు చెల్లించా లని కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమ వారం సిఐటియు, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో ఎంపిడిఒ శివప్రసాద్‌రెడ్డి, ఈవోఆర్డీ అంజనప్పకు వినతి పత్రం ఇచ్చారు. సిఐటియు, ఎపి రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్మికులకు 12 నెలలుకు పైగా వేతనాలు అందడం లేదన్నారు. దీంతో వారికి కుటుంబ పోషణ భారమైందన్నారు. కావున ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బకాయి వేతనాలు చెల్లించడంతో పాటు నెల నెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని కోరారు. లేనిచో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రమణ, రైతు సంఘం నాయకులు రామిరెడ్డి, మండల కన్వీనర్ కుళ్లాయప్ప, కార్మికులు రమేష్, రమణప్ప పాల్గొన్నారు.


ఎంపిడిఒ కార్యాలయంలో వినతి ఇస్తున్న కార్మికులు

నియోజకవర్గంలో విస్తృతంగా రోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

రాప్తాడు నియోజకవర్గంలో ఎక్కడా రోడ్డు సమస్య లేకుండా చేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మండలంలోని న్యామద్దెల నుంచి వయా చిన్నప్పేట మీదుగా హరియాన్‌చెరువు వరకూ జరుగుతున్న రహదారి పనులను సోమవారం ఎమ్మెల్యే మండల నాయకులతో కలిసి పరిశీలించారు. ముందుగా చిన్నప్పేట గ్రామంలో వాల్మీకి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆ తర్వాత రూ. 2.94 కోట్ల వ్యయంతో చేపట్టిన 3.7 కిలోమీటర్ల తారురోడ్డు, సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రస్తుతం 3 కిలోమీటర్ల మేర తారు రోడ్డు పనులు పూర్తి చేసినట్టు కాంట్రాక్టర్లు, అధికారులు తెలుపగా మిగిలిన సీసీ రోడ్డు, బ్రిడ్జి నిర్మాణ పనులను నాణ్యతగా గడువులోపు పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ పనులు పూర్తయితే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. మండలంలో 1.2 కిలోమీటర్ల బురుజుగుట్టపల్లి రోడ్డు నిర్మాణానికి రూ. 1.12 కోట్లు, వెల్దుర్తి నుంచి ఎర్రోనిపల్లి వరకూ 12 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 3.35 కోట్లు, ధర్మవరం–కొత్తచెరువు రోడ్డులోని ఆమిదాలకుంట నుంచి ఒంటికొండ మీదుగా వెంకటంపల్లి వైపు 6 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 2.35కోట్ల నిదులు మంజూరయ్యాయన్నారు. ఆయా పనులను త్వరలోనే ప్రారంభించి వేగంగా పూర్తి చేస్తామన్నారు. రూ. 1.41 కోట్లతో నాగసముద్రం గ్రామంలోకి బిటి రోడ్డు, 7 గ్రామ పంచాయతీల్లోని 10గ్రామాల్లో రూ. 3.6 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు చెప్పారు. బసంపల్లి, చందమూరు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామన్నారు. గత ఐదేళ్లలో జరిగిన నిర్లక్ష్యం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత వారీగా పనులు చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఎక్కడెక్కడ రోడ్లు వేయాలన్నది గుర్తిస్తున్నామని, రానున్న రోజుల్లో ఎక్కడా రోడ్డు సమస్య లేకుండా చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.

న్యామద్దెల- చిన్నప్పేట రహదారిని పరిశీలించిన ఎమ్మెల్యే


రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీత, నాయకులు

వైసిపిని వీడి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

అమడగూరు మండలంలోని చిన్నగానిపల్లి పంచాయతీకి చెందిన 20 వైసిపి కుటుంబాలు సోమవారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో టిడిపిలో చేరాయి. వారికి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి టిడిపి కండువా సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపిలో కీలకంగా ఉన్న హనుమంతరెడ్డి, డి.భాస్కర్, జయరామ్, రామలింగారెడ్డి, ఎం.భాస్కర్ రెడ్డి, హనుమంత్‌రెడ్డి, శివ, ఆది తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరారు. వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా వైసిపిలో పని చేసినా తమకు సరైన గుర్తింపు లేదన్నారు. దీనికి తోడు సిఎం చంద్రబాబు, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టిడిపిలో చేరామన్నారు. పార్టీలో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తామని పల్లె హామీ ఇచ్చారు.



టిడిపిలో చేరిన వారికి కండువా వేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

విద్యుత్ తీగల క్రమబద్ధీకరణ పనులు పరిశీలన

పట్టణంలో సత్యసాయి శతజయంతి ఉత్సవాలు సమీపిస్తున్నందున నూతనంగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలు, తీగల క్రమబద్ధీకరణ పనులను ఎమ్మెల్యేతో పాటు మాజీమంత్రి పరిశీలించారు. ఉత్సవాల సమయంలో ఎక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా పనులు పూర్తి చేయాలని విద్యుత్ శాఖ అధికారుకు సూచించారు. అనంతరం పట్టణంలో పలు అభివృద్ధి పనులకు వారు భూమిపూజ చేశారు.

విద్యార్థులకు క్రీడలూ అవసరమే

ప్రజాశక్తి-నల్లచెరువు

విద్యార్థుల భవిష్యత్తుకు చదువుతో పాటు క్రీడలు ఎంతో దోహదపడతాయని హెచ్‌ఎం విజయలక్ష్మి తెలిపారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో అండర్–17, 14 బాల బాలికల విభాగంలో విద్యార్థులకు మండల స్థాయి వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, చెస్, అథ్లెటిక్స్, తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హెచ్‌ఎం విజయలక్ష్మి హాజరై మాట్లాడారు. ఈ పోటీల్లో ఉబిచర్ల, తవలంమర్రి పాఠశాలల క్రీడాకారులు పాల్గొన్నారని తెలిపారు. ఇక్కడ ప్రతిభ చూపిన క్రీడాకారులు త్వరలో డివిజనల్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ షఫీ, ఉపాధ్యాయులు రాజగోపాల్, లక్ష్మీనారాయణ, గౌస్‌ఖాన్, అశోక్‌రెడ్డి, పిడిలు లలిత, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


నల్లచెరువులో క్రీడాకారులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం విజయలక్ష్మి

గాండ్లపెంట : మండలంలోని గాండ్లపెంట, కటారుపల్లి, రెక్కమాన్, నీరుకుంట్లపల్లి, తుమ్మలబైలు పాఠశాలల్లో సోమవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించినట్లు హెచ్‌ఎం టి.ప్రసాద్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, యోగా, షటిల్, బ్యాడ్మింటన్, చదరంగం, అథ్లెటిక్స్ పోటీల్లో సుమారు 200 మంది పాల్గొన్నారన్నారు. వారిలో 70 మంది ప్రతిభ చాటి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పిటిఎం మురార్ షావలి, లక్ష్మీనారాయణరెడ్డి, తాహెర్‌అలీ, రాష్ట్రస్థాయి క్రీడల కన్వీనర్ యు.హరిప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు పాపారాయుడు, అరుణ్‌ప్రసాద్, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు

ముదిగుబ్బ : ప్రజలు ఇంటి పన్ను ఆన్‌లైన్(డిజిటల్ విధానంలో) ద్వారా చెల్లించవచ్చని పంచాయతీ కార్యదర్శి మంజులదేవి తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ ముందు నీటి పన్ను, షాప్ లైసెన్సు, తదితర పన్నులను ఆన్‌లైన్‌లోనే చెల్లించేలా సంస్కరణలు జరుగుతున్నాయని తెలిపారు. ఇంటి పన్నులో పేరు మార్పునకు సంబధిత డాక్యుమెంట్లు జత చేసి ఒక అర్జీ ఇస్తే అప్పటికప్పుడే పేరు మారుస్తున్నామని, ఎలాంటి జాప్యం జరగదదని తెలిపారు.

నేషనల్ గేమ్స్‌లో కాంస్య పతకం



తలుపుల : ఇటీవల సూరత్‌లో జరిగిన కుడో నేషనల్ గేమ్స్‌లో తలుపులకు చెందిన షరీఫ్‌బాషా కుమారుడు ఫిరోజ్ కాంస్య పతకం సాధించినట్లు ఫిజికల్ డైరెక్టర్ హరి తెలిపారు. అండర్–14 బాలుర విభాగంలో ఫిరోజ్ రాష్ట్రం తరపున పాల్గొని ప్రతిభ చాటి కాంస్య పతకం సాధించడంతో పిడి హరి, తదితరులు అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ముదిగుబ్బ : సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక పిహెచ్‌సి వైద్యులు రాజేంద్ర, శ్వేత తెలిపారు. సమ్మె విరమణ తర్వాత వారు విధుల్లో చేరారు. వారు మాట్లాడుతూ తాము సమ్మెలో ఉన్నప్పటికీ స్టాఫ్ నర్సులు, సిబ్బంది ద్వారా రోగుల స్థితిగతులు తెలుసుకుంటూ ఫోన్ ద్వారానే సలహాలు, సూచనలు ఇస్తూ వచ్చామని తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయన్నారు. గత నెల వ్యవధిలో 65 కుక్కకాటు కేసులు నమోదైనట్లు తెలిపారు. వర్షాలు కురుస్తుండటం వల్ల పొలాలకు వెళ్లే రైతులు విష పురుగుల నుంచి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయా అంశాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే 'పల్లెబాట'

లేపాక్షి : ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లి పరిష్క రిస్తామని ఎమ్మెల్యే పిఎం సురేంద్ర తెలిపారు. సురేంద్ర, మండల అధ్యక్షులు అభిలాష్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని బిసలమానేపల్లి పంచాయతీలో పల్లెబాట కార్యక్రమం నిర్వహించారు. వారు సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, తాగునీరు, తదితర అంశాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి సమస్యలపై ఆరా తీశారు. వారి వెంట పర్యాటక శాఖ డైరెక్టర్ జయప్ప, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మాలక్క, పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబు, నాయకులు ఆనంద్, అశ్వర్థప్ప, సంజీవ, ఆదినారాయణ, తదితరులు ఉన్నారు.

చేనేత కుటుంబానికి ఆర్థికసాయం

సోమందేపల్లి : స్థానిక సప్తగిరి కాలనీలో నివాసం ఉండే ఇంద్ర(45) మరమగ్గాలు రిపేరీ చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడు. ఆయన భార్య లక్ష్మీదేవి వికలాంగురాలు. వీరికి 9 ఏళ్ల కూతురు ఉంది. అయితే పక్షవాతం కారణంగా కొన్ని రోజుల క్రితం ఇంద్ర మృతి చెందాడు. దీంతో తొగటవీర క్షత్రియ చేనేత కులస్తులు లక్ష్మీదేవికి రూ. 30,500 నగదు అందజేశారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం అధ్యక్షుడు సిసి.హరిదాసు, సూరి, శ్రీనివాసులు, సోము, గట్టు శ్రీనివాసులు, జగదీష్, మహేంద్ర, రంగన గోపాల్, శ్రీనాథ్, శివ, మనోహర్, అమర్నాథ్, గిరి, నేతాజీ, ధన, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

పుట్టపర్తి రూరల్ : మండలంలోని జగరాజుపల్లి ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఇఒ బి. ప్రసాద్ సందర్శించి రికార్డులను పరిశీలించారు. పాఠశాలలో 25 మంది విద్యార్థులు ఉన్నారని, రికార్డుల నిర్వహణ, విద్యా ప్రమాణాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అదే ప్రాంగణంలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థినులకు చట్టాలపై అవగాహన

బుక్కపట్నం : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండి తమ హక్కులను కాపాడుకోవాలని ఎస్ఐ కృష్ణమూర్తి సూచించారు. నేటి సమాజంలో జరుగుతున్న నేరాలపై సోమవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ సైబర్ నేరాలు, గుడ్ టచ్–బ్యాడ్ టచ్, బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలన్నారు. విద్యార్థులు, మహిళల రక్షణకై ప్రభుత్వం అనేక చట్టాలు తీసుకొచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ఓబుళదేవరచెరువు : మండలంలోని గౌనిపల్లి జడ్పీ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న మోక్షిత పుట్టినరోజు సందర్భంగా సోమవారం పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం పి.విజయమ్మ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అనంతరం 50 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులకు మెనూతో పాటు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, టైలర్ కవిత, పాఠశాల పూర్వ విద్యార్థి మల్లెల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ పరిస్థితులపై సమావేశం

గుడిబండ : మొంథా తుఫాన్‌పై సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండలంలోని వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహశీల్దార్ శ్రీధర్ మాట్లాడుతూ నాలుగు రోజులు భారీ ఈదురుగాలులతో వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. సాయం కోసం కంట్రోల్ రూమ్ 79895 41192, 70701 372155లో సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో నాగరాజునాయక్, పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనానికి స్థలం కేటాయించాలని వినతి

రొద్దం : కమ్యూనిటీ భవనం నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం మండలంలోని నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ ఉదయ శంకర్ రాజుకు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ రొద్దంలో సుమారు 25 నాయీ బ్రాహ్మణ కుటుంబాలు ఉన్నాయన్నారు. కావున కమ్యూనిటీ భవనం నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరారు. స్పందించిన తహశీల్దార్ పరిశీలించి న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రెసిడెంట్ రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ మంజు, ట్రెజరర్ విజయ్ కుమార్, చంద్రశేఖర్, మంజునాథ్, నాగార్జున, అశోక్, దాలప్ప, త్యాగరాజు, నాగరాజు, చలపతి, లింగప్ప, క్రిష్టప్ప, శంకరప్ప, రామాంజి పాల్గొన్నారు.


తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఎరుకల ప్రజాపోరాటసమితి రాష్ట్ర అధ్యక్షుడిగా సురేష్

ధర్మవరం రూరల్ : ఎరుకల ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులుగా పట్టణానికి చెందిన గుజ్జల సురేష్‌ను నియ మించారు. ఇటీవల అనంతపురంలోని ఎన్‌జిఒ హోంలో నిర్వహించిన సమావేశంలో అతడిని ఎన్నుకు న్నారు. గుజ్జల సురేష్ గతంలో ఏడాది సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉంటూ పలు సేవలందించడంతో పాటు అనేక పోరాటాల్లో పాల్గొన్నారు. జి.సురేష్ మాట్లాడుతూ ఎరుకల జాతి హక్కుల కోసం శక్తివంచన లేకుండా రాజీలేని పోరాటలు చేస్తామని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పజెప్పిన రాష్ట్ర నాయకులు గుజ్జల ముత్యాలమ్మ, గంగులప్ప, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జల ఆదర్శ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల కమిటీలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.



రోడ్డు దుస్థితిపై ఎమ్మెల్యేకు వినతి


తలుపుల : తలుపుల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలు, మాడికి వాండ్ల పల్లి నుంచి బురుజుపల్లి వరకూ రోడ్డు దుస్థితిపై సోమవారం కదిరిలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మాడికి వాండ్ల పల్లి గ్రామానికి చెందిన ఉబ్బర రాజారెడ్డి, గ్రామస్తులు కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ పంచాయతీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. ప్రధానంగా మాడికివాండ్లపల్లి గ్రామం నుంచి బురుజుపల్లి రోడ్డు కొన్నేళ్లుగా అధ్వానంగా మారిందని దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు.


ఎమ్మెల్యేకు వినతి ఇస్తున్న గ్రామస్తులు

టిడిపి కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని మల్లాపల్లి గ్రామంలో టిడిపి కార్యకర్త ఆర్యవైశ్య సంఘం సభ్యులు కొమ్మిశెట్టి నారాయణమూర్తి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, నాయకులు ఆ గ్రామం వెళ్లి నారాయణమూర్తి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ. 22వేలు ఆర్థికసాయం చేశారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మల శ్రీధర్, నరేష్, ఉత్తమరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు జయచంద్ర, నాగేనాయక్, మహమ్మద్, వెంకటరెడ్డి, ఉమర్‌ఖాన్, రోహిత్ పాల్గొన్నారు.


మృతుని కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న టిడిపి నాయకులు

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-రొద్దం

అనారోగ్యం కారణంగా ఓ వృద్ధుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం మండలంలోని సుబ్బరాయప్పగారి కొట్టాల గ్రామంలో చోటుచేసుకుంది. ఆ గ్రామానికి చెం దిన బోయ రామన్న(75) కొద్ది రోజులుగా ఆయాసంతో బాధపడుతుండేవాడు. పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా తగ్గలేదు. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఉండగా ఆయాసం ఎక్కువ కావడంతో రొద్దం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాడు. జీవితంపై విరక్తి చెంది అక్కడి నుంచి గ్రామ సమీపం లోని పూజమ్మ ఆలయం వద్ద ఓ చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన గొర్రెల కాపరులు సమాచారం ఇవ్వడంతో వెంటనే కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకున్నారు. విషయం తెలిసిన వెంటనే ట్రైనీ ఎస్ఐ గోపాలకృష్ణ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, అనంతరం పోస్టుమార్టం కోసం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకొన్న టిడిపి మండల కన్వీనర్ నరహరి, నాయకులు చిన్నప్పయ్య, సింగిల్‌విండో అధ్యక్షులు వీరాంజనేయులు, రాము అక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

లారీ టైర్లకు నిప్పు.. రూ. 2 లక్షల నష్టం

ప్రజాశక్తి-పెనుకొండ

ప్రమాదవశాత్తూ లారీ టైర్లకు నిప్పు అంటుకోగా డ్రైవర్ అప్రమత్తతతో త్రుటిలో పెనుప్రమాదం త్రుటిలో తప్పింది. అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వర్లు తెలిపిన వివరాలు.. కడప జిల్లా ప్రొద్దుటూరు నుంచి కర్నాటకలోని తుముకూరుకు ఓ లారీ వడ్ల(వరి) లోడుతో బయల్దేరింది. మార్గమధ్యలో సోమవారం తెల్లవారుజామున టైరు పంచర్ అయింది. అటవీ మార్గంలో కావడంతో భయపడిన డ్రైవర్ హరీష్ ఏదైనా గ్రామం కనిపిస్తే ఆపుదామని అలాగే లారీని ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో రాపిడి కారణంగా పెనుకొండ మండలం కొండంపల్లి వద్దకు రాగానే టైర్లకు నిప్పు అంటింది. అప్రమత్తమైన డ్రైవర్ లారీని ఆపి సమాచారం ఇవ్వడంతో అగ్నిమాపక శాఖ అధికారి వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని టైర్లకు నిప్పును ఆర్పి వేశారు. దీంతో లారీలో ఉన్న సుమారు రూ.30 లక్షల విలువైన వరి ధాన్యాన్ని కాపాడారు. అయితే టైర్లు పూర్తిగా కాలిపోయి రూ. 2 లక్షల నష్టం సంభవించింది.

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి

ప్రజా గ్రీవెన్స్‌లో ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సూర్యనారాయణరెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ సూర్యనారాయణ రెడ్డి సంబంధిత అధికారులు ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్‌లో ఆయనతో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామసుబ్బయ్య, ఆర్డీవో సువర్ణ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అందులో వివిధ సమస్యలపై మొత్తం 237 అర్జీలు అందాయి. డిఆర్‌ఒ మాట్లాడుతూ గ్రీవెన్స్‌లో అందిన అర్జీలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విచారణ జరిపి అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలే వస్తున్నాయని, అధికారులు ప్రజలను పదే పదే కార్యాలయాల చుట్టూ తిప్పకోకుండా పరిష్కరించాలన్నారు. మీ స్థాయిలో పరిష్కారం కాకపోతే సమగ్ర నివేదికను కలెక్టర్‌కు పంపాలన్నారు. జిల్లా వ్యాప్తంగా భూ సమస్యలు, ఇళ్ల పట్టాలు, రేషన్ కార్డులు, పింఛన్లు, తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు సమర్పించారు.


అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌ఛార్జి డిఆర్‌ఒ